అన్ని రంగాల్లో రాణిస్తేనే ఉన్నత అవకాశాలు


ప్రారంభించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్‌ శ్రీదేవి

కుషాయిగూడ: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఉన్నత అవకాశాలు సొంతం అవుతాయని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో 68వ కీసర జోనల్‌స్థాయి క్రీడాపోటీలను గురువారం స్థానిక కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే విస్తృత అవకాశాలు లభిస్తాయన్నారు. ఆ దిశగా విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి మాట్లాడుతూ.. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు శారీరక దారుఢ్యం సొంతమవుతుందన్నారు. గెలుపోటములు సహజమని, స్నేహపూరిత వాతవరణంలో పోటీపడాలన్నారు. అండర్‌–14, అండర్‌–17 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించనున్నారు. రెండ్రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌ క్రీడల్లో పోటీలు జరగనున్నాయి. జోనల్‌ పరిధిలోని సుమారు 1500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. మాజీ కార్పొరేటర్‌ కొత్త రామారావు, మండల విద్యాధికారి శశిధర్‌, పాఠశాల హెచ్‌ఎం బాపురెడ్డి, కిష్టయ్య, రమేష్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్‌, పాండురంగారెడ్డి, తిరుమల్‌రెడ్డి, మనోహర్‌, అనిత తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి


బాలరాజును సన్మానించిన జర్నలిస్టులు


మల్కాజిగిరి: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నల్లతీగెల బాలరాజు అన్నారు. రాష్ట్ర టీయూడబ్ల్యూజే, ఐజేయూ ప్రధాన కమిటీకి అనుబంధగా ఏర్పాటు చేసిన మఫిసిల్‌ అండ్‌ వెల్ఫేర్‌ కమిటీ సభ్యుడిగా మల్కాజిగిరి ప్రెస్‌క్లబ్‌(543) అధ్యక్షుడు నల్లతీగల బాలరాజు నియమితులు కాగా ఆయనను ఈ సందర్భంగా సన్మానించారు. బాలరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వస్తాయన్న నమ్మకం ఏర్పడిందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కమిటీ సభ్యుడిగా పలు సూచనలు అందచేస్తానన్నారు. గౌరవ అధ్యక్షుడు రవియాదవ్‌, ప్రధాన కార్యదర్శి విశాల్‌యాదవ్‌, కోశాధికారి రహమాన్‌ పాత్రికేయులు మోహన్‌రావు, సునీల్‌ రెడ్డి, లవకుమార్‌, శివకుమార్‌, సంగమేష్‌, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌, పవన్‌, సుబ్బారావు, మహేందర్‌, నాగరాజు, కుమ్మరి రాజు, సత్య, ప్రభాకర్‌, శివ యాదవ్‌, సంతోష్‌, జాన్‌, దుర్గాప్రసాద్‌, జ్యోతికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

మల్కాజిగిరి: దినకర్‌నగర్‌ ఆర్‌యూబీ వద్ద రోడ్డు సమస్యను పరిష్కరించామని మల్కాజిగిరి డివిజన్‌ కార్పొరేటర్‌ శ్రవణ్‌ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్‌యూబీ వద్ద వర్షం పడిన సమయంలో రోడ్డు లెవెల్‌ సరిగ్గా లేకపోవడంతో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలిగేదని, ఈ సమస్య పరిష్కారం కోసం 30 మీటర్ల వరకు సీసీరోడ్డు ప్యాచ్‌వర్క్స్‌ జరిగాయని, పైపులైన్‌ పనులు పూర్తైతే సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఈఈ లక్ష్మణ్‌, ఏఈ దీపక్‌, వీఐ రమేష్‌, గోపి, మురళి పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శ్రవణ్‌

జెడ్సీని కలిసిన కార్పొరేటర్‌


జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్‌

అల్వాల్‌: మచ్చబొల్లారం డివిజన్‌ కార్పొరేటర్‌ రాజ్‌జితేంద్రనాథ్‌ గురువారం కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ అపూర్వ్‌ చౌహాన్‌ ఐఏఎస్‌ను కలిశారు. డివిజన్‌ పరిధిలో డ్రైనేజీ లైన్లు, సీసీరోడ్లు, తాగునీటి లైన్లు తదితర పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఆయన వినతిపత్రంలో కోరారు. దీనికి జెడ్సీ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్‌ చెప్పారు.

స్వచ్ఛతకు అందరూ సహకరించాలి


స్వచ్ఛ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్‌ జంగయ్యయాదవ్‌

బోడుప్పల్‌: స్వచ్ఛ భారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని బోడుప్పల్‌ కమిషనర్‌ రామలింగం అన్నారు. స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా గురువారం చెంగిచర్ల 1వ డివిజన్‌ పోచమ్మ చెరువు వద్ద కార్పొరేటర్‌ బింగి జంగయ్యయాదవ్‌, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ కమలాకర్‌ జవాన్‌ వినోద్‌ కాలనీవాసులు చెత్తను తొలగింపజేశారు. అనంతరం గణేష్‌ వినాయక మండపాల వద్ద వ్యర్థాలను తొలగించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులచే మానవహారం నిర్వహించి శుభ్రతపై అవగాహన కల్పించారు. ఆఫీసర్‌ నరేష్‌, స్వచ్ఛ భారత్‌ మిషన్‌ కో– ఆర్డినేటర్లు మల్లేష్‌, మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన


పోషకాహారంపై అవగాహనలో మహిళలు, తల్లులు

మేడిపల్లి: ఆరోగ్య సమాజం లక్ష్యంగా పోషకాహారంపై అందరిలో సంపూర్ణ అవగాహన కలిప్పంచేందుకు ప్రతిష్టాత్మకంగా పోషణ్‌ అభియాన్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్‌ అల్వాల్‌ సీడీపీఓ స్వాతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం పీర్జాదిగూడ–2 అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీఓ మాట్లాడుతూ.. పిల్లలు, మహిళల్లో రక్తహీనత, తక్కువ బరువుతో శిశువులు జన్మించడం వంటి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని మరింతగా అధిగమించేందుకు పోషణ్‌ అభియాన్‌మాసం అన్ని ప్రాంతాల్లో జరుపుతున్నామని తెలిపారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికల్లో రక్తహీనత లోపాన్ని గుర్తించి సమన్వయ కార్యాచరణ, ప్రణాళికలతో ఐసీడీఎస్‌ ద్వారా అంగన్‌వాడి టీచర్లకు ఇప్పటికే శిక్షణను ఇచ్చామన్నారు. చిన్నారులకు 6నెలల తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం అందించడంపై తల్లులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు సత్తమ్మ, చంద్రకళ, మేడిపల్లి సెక్టార్‌ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సిల్క్‌ వస్త్ర ప్రదర్శన



అల్వాల్‌: అల్వాల్‌ శ్రీసాయి గార్డెన్‌ ఫంక్షన్‌హాల్‌లో కళాసిల్క్‌ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళాసిల్క్‌ వస్త్ర ప్రదర్శన వినియోగదారులను ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో పోచంపల్లి, ఉప్పాడ, బనారస్‌ సిల్క్‌, కశ్మీరి సిల్క్‌, 1 గ్రా. గోల్డ్‌ జువెలరీ, బెంగాల్‌ కాటన్‌ చీరలు, జైపూర్‌ కుర్తీస్‌, కోటా శారీస్‌, లక్నో వర్క్‌ కుర్తీస్‌, హరియాణా బెడ్‌షీట్స్‌ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు వికాస్‌జైన్‌ చెప్పారు. వచ్చే దసరా పండుగ వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు.

వ్యక్తి దారుణ హత్య

కుషాయిగూడ : ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కంటోన్మెంట్‌ ఆర్మీ ఏరియా సర్వెంట్‌ క్వార్టర్స్‌లో నివాసం ఉండే డ్రైవర్‌గా పని చేసే జోసెఫ్‌ బెనర్జీ (35) బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి కుషాయిగూడ వైపు బయలుదేరి తిరిగి రాలేదు. గురువారం రాత్రి అమ్ముగూడ శ్మశానవాటికలో మృతి చెంది ఉండటంతో స్థానికులు డయల్‌ 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆరోగ్య బీమా.. వృద్ధులకు ధీమా..!



◆ ప్రజారోగ్యానికి కేంద్రం పెద్ద పీట
◆ పేద, ధనిక అనే తారతమ్యం లేదు
◆ 70 ఏళ్లు నిండిన అందరికీ ఉచిత వార్షిక బీమా
◆ రూ. 5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం

గ్రేటర్‌సహా శివారు జిల్లాల్లో 5 లక్షల మందికిపైనే వృద్ధులు ఉంటారని అంచనా

సాక్షి, సిటీబ్యూరో: ప్రజా వైద్యానికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ. 5 లక్షల ఉచిత వార్షిక వైద్య బీమా సౌకర్యాన్ని కల్పించే నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు ఇటీవల కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. దీనివల్ల అన్ని సామాజికవర్గాల వృద్ధులకు వైద్య బీమా లభించనుంది.

◆ దరఖాస్తు చేసుకున్న వారికి నూతన కార్డులు జారీ చేయనుంది. దేశ ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్‌ భారత్‌ ప్రధాన మంత్రి–జన్‌ ఆరోగ్య యోజన (ఏబీపీఎం–జేఏవై)ను 2018 నుంచి అమలు చేస్తోంది.

◆ తాజాగా ఈ పథకాన్ని 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు విస్తరిస్తోంది. ఆదాయంతో సంబంధం లేకుండా వృద్ధులందరూ ఆయుష్మాన్‌ భారత్‌ పథకం ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా పొందవచ్చు.

5 లక్షల మంది వృద్ధులకు ప్రయోజనం...

ప్రస్తుతం వైద్యంపై చేసే వ్యయం భారీగా పెరుగుతున్న తరుణంలో కేంద్రం తీసుకొచ్చిన రూ. 5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా పథకంతో గ్రేటర్‌ హైదరాబాద్‌సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాల్లో సుమారు 5 లక్షల మంది వృద్ధులకు ప్రయోజనం చేకూరనుంది.

◆ వయసు పెరిగేకొద్దీ వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలు వెంటాడుతాయి. ఈ పథకంతో ఆయా కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గనుంది.

◆ ఈ పథకం ద్వారా ఒక కుటుంబంలో 70 ఏళ్లు పైబడినవారు ఒక్కరు ఉంటే రూ. 5 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. అదే ఇద్దరు ఉంటే రూ. 2.50 లక్షల చొప్పున ఇలా.. కుటుంబంలో 70 ఏళ్లు పైబడినవారు ఎంతమంది ఉన్నా.. వారందరికీ రూ. 5 లక్షలు సమానంగా వర్తిస్తాయి. ఇప్పటికే వేర్వేరు బీమా పథకాల్లో నమోదైన వృద్ధులు సైతం ఆయుష్మాన్‌ భారత్‌లో లబ్ధి పొందవచ్చు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంటోంది.

వృద్ధులకు అవగాహన కల్పించే దిశగా...

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్‌ భారత్‌ పథకం విధివిధానాలపై ప్రజల్లో స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరముంది. 2018 నుంచి ఈ పథకం అమలవుతున్నా.. అర్హులెవరనే దానిపై ప్రజల్లో స్పష్టత లేదు. అర్హులకు ఏఏ ఆస్పత్రుల్లో వైద్యం అందుబాటులో ఉంటుంది.. బీమా ఎలా వర్తింపజేసుకోవాలనే అంశాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఎలాంటి ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా 70 ఏళ్లు పైబడిన వారందరికీ ఈ పథకం వర్తింపజేయనుండటంతో దరఖాస్తు విధానం, బీమా పొందటంపై వృద్ధులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

అర్హతలు ఇవే...

◆ ఈ పథకం కింద ఇప్పటి వరకు ఆర్థికంగా వెనుకబడిన కొన్ని వర్గాల ప్రజలకు మాత్రమే అందుబాటులో ఉంది. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆదాయంతో సంబంధం లేకుండా 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ కుటుంబం ఆధారంగా రూ. 5 లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తోంది. ప్రైవేటు ఆరోగ్య బీమా ఉన్నవారికి కూడా ఈ పథకం వర్తించనుంది.

◆ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ హెల్త్‌ స్కీమ్‌ (సీజీహెచ్‌ఎస్‌), ఎక్స్‌ సర్వీసు మెన్‌ కాంట్రిబ్యూటరీ హెల్త్‌ స్కీమ్‌ (ఈసీహెచ్‌ఎస్‌) వంటి ఇతన పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్నవారు వాటినే కొనసాగించవచ్చు లేదా ఆయుష్మాన్‌ భారత్‌ పథకాన్ని ఎంచుకోవటానికి అవకాశముంది. రాష్ట్ర ప్రభుత్వ బీమా పథకాలు పొందేవారికి వాటితో సంబంధం లేకుండా ఈ పథకం వర్తిస్తుంది.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల పంపిణీ



బోడుప్పల్‌: ఎస్‌బీఆర్‌ కాలనీలోని సహృదయ వృద్ధాశ్రమంలో గురువారం వారాహి కాలనీ ప్రతినిధులు నిత్యావసర వస్తువులను వితరణ చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు వేంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. వృద్ధులకు వారి చివరి రోజుల్లో ఆసరాగా ఉండటం ఎంతో అవసరమన్నారు. కాలనీ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, సభ్యులు డాక్టర్‌ వెంకటరమణ, సురేందర్‌, మల్లేష్‌, మల్లేష్‌యాదవ్‌, దాడిరెడ్డి శివశంకర్‌రెడ్డి, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బస్సురూటు పునరుద్ధరణపై హర్షం


జె.కమలాకర్‌ కాంగ్రెస్‌ నేత

కాప్రా: కందిగూడ నుంచి నగరంలోని వివిధ ప్రాంతాలకు తిరిగి యథాతథంగా బస్సులు ప్రారంభించినందుకు ఆర్టీసీ అధికారులకు గ్రేటర్‌ హైదరాబాద్‌ కాంగ్రెస్‌ కమిటీ ఎస్సీసెల్‌ కన్వీనర్‌ కమలాకర్‌ కృతజ్ఞతలు తెలిపారు. ఈసీఐఎల్‌ నుంచి కందిగూడ మీదుగా 37, 37ఈ, 24ఈ తిరిగి ప్రారంభించినందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా ట్రయల్‌రన్‌లా నడిపారని, ఇకపై రెగ్యులర్‌గా బస్సుసౌకర్యం ఉంటుందని, ఆర్టీసీ అధికారులు తెలిపారన్నారు. వీటితో పాటు 16ఎస్‌వై, 3పి, కోఠి, ఈసీఐఎల్‌ నుంచి కందిగూడ మీదుగా యాప్రాల్‌ బస్సులు కూడా నడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కందిగూడకు బస్సులు తిరిగి ప్రారంభించేందుకు కృషి చేసిన వీజీ జస్వంతరావు, విచేందర్‌, సతీష్‌, వినోద్‌ కుమార్‌, ప్రదీప్‌ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


గౌతంనగర్‌లో షాప్‌ షెట్టర్లను కూల్చివేయిస్తున్న సిబ్బంది

గౌతంనగర్‌: గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలోని హనుమాన్‌పేటలో ప్రధాన రహదారిపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని గురువారం మల్కాజిగిరి సర్కిల్‌ టౌన్‌ప్లానింగ్‌ అధికారి బాలశ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కూల్చివేశారు. రెసిడెన్షియల్‌ అనుమతి తీసుకుని కమర్షియల్‌గా నిర్మించిన రెండు షెట్టర్లను కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించబోమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా మిలాద్‌ ఉన్‌ నబీ వేడుకలు


మిలాద్‌ ఉన్‌ నబీ వేడుకల్లో ఎమ్మెల్యే తదితరులు


వేడుకల్లో మేయర్‌ అమర్‌సింగ్‌

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ 6వ డివిజన్‌ వద్ద గల మసీద్‌ వద్ద గురువారం ఏర్పాటు చేసిన ఈద్‌ ఏ మిలాద్‌ ఉన్‌ నబీ వేడుకల సందర్భంగా చేపట్టిన జులుస్‌, శాంతిర్యాలీలో పాల్గొన్న ముస్లింలను మేయర్‌ అమర్‌సింగ్‌ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాంతి ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ మేయర్‌ కుర్ర శివకుమార్‌గౌడ్‌, సీనియర్‌ నాయకులు మాడుగుల చంద్రారెడ్డి, పప్పుల అంజిరెడ్డి, వంగూరి పరమేష్‌, కొల్తూరి సాయి పాల్గొన్నారు.

ప్రవక్త బోధనలు ఆచరణీయం..

రామంతాపూర్‌ : మహ్మద్‌ ప్రవక్త జన్మదినం సందర్భంగా గురువారం పెద్ద మజీద్‌లో ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వ మానవ సమానత్వం శాంతి స్థాపనే లక్ష్యంగా మహ్మద్‌ ప్రవక్త బోధించిన బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమన్నారు. బీఆర్‌ఎస్‌ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, సూరం శంకర్‌, చాంద్‌ పాషా, తరుణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


చింతల అరుణ (ఫైల్‌)

మేడిపల్లి: పెళ్లైన 5 నెలలకే ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌ బోయగూడకు చెందిన చింతల అరుణ (29)పెద్దపల్లికి చెందిన రాకేష్‌లు ప్రేమించుకుని పెద్దలను ఒప్పించి మార్చి నెలలో వివాహం చేసుకున్నారు. రాకేష్‌ నగరంలో ప్రైవేటు ఉద్యోగి కాగా.. బోడుప్పల్‌ ఆర్‌ఎన్‌ఎస్‌ కాలనీలో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి భర్త ఇంట్లో లేని సమయంలో ఇంటి కిటికీ గ్రిల్స్‌కు తాడుతో భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త వచ్చి చూడగా.. తలుపు లోపలి నుంచి గడిపెట్టి ఉంది. దీంతో పగులగొట్టి చూసేసరికి ఉరేసుకుని కనిపించింది. హుటాహుటీనా స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అదనపు కట్నం కోసం భర్తతో పాటు వారి కుటుంబసభ్యులు వేధించడం వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి లలిత ఆరోపిస్తూ.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పెంపుడు కుక్కలకు రేబిస్‌ టీకాలు

మేడిపల్లి: వరల్డ్‌ రేబిస్‌ డే సందర్భంగా పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు టీకాలను పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో బ్లూక్రాస్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ ఎన్‌జీఓ ద్వారా ఈనెల 21న శనివారం ఉదయం 8.00 గంటల నుంచి ఒంటి గంట వరకు డెకాత్లాన్‌ వద్ద వరల్డ్‌ రేబిస్‌ డే కార్యక్రమంలో భాగంగా టీకాలను వేస్తున్నట్లు కమిషనర్‌ త్రిలేశ్వర్‌రావు ప్రకటించారు. ఈ సందర్భంగా వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు ప్రమాదవశాత్తు కరిచినా వ్యాధి సోకకుండా ఉండేందుకు కుక్కలకు రేబీస్‌ వ్యాక్సినేషన్‌ వేయనున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని పెంపుడు కుక్కలు ఉన్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్‌ సూచించారు.

బఫర్‌జోన్‌లో ఆక్రమణలను తొలగించాలి

మల్లాపూర్‌: నాచారం ఎర్రకుంట, పటేల్‌ చెరువు, హెచ్‌ఎంటీనగర్‌ చెరువులోని బఫర్‌జోన్‌, ఎఫ్‌టీఎల్‌లో వెలసిన నిర్మాణాలు, ఆక్రమణలను తొలగించాలని కోరుతూ.. గురువారం హైడ్రా కమిషనర్‌కి నాచారం చెరువుల పరిరక్షణ సమితి కన్వీనర్‌ కొమ్మగళ్ల వెంకటేశ్వర్లు వినతి పత్రం అందజేశారు. గతంలో చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వ విభాగాల అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రసుత్తం చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్రప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. హైడ్రా ఆధ్వర్యంలో చెరువుల పునరుద్ధరణకు పెద్దపీట వేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన


పనులను పరిశీలించిన కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి సూచించారు. చర్లపల్లి డివిజన్‌, అయ్యప్పకాలనీలో సీసీ రోడ్డును ఆమె గురువారం పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. దశలవారీగా అవసరమైన అన్ని కాలనీల్లో అంతర్గత రోడ్లతో పాటుగా సీసీరోడ్డు నిర్మాణాలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

అల్వాల్‌: మచ్చబొల్లారం డివిజన్‌ చేతన కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీలను ఆధునీకరించాలని, కాలనీలోని సర్వే నెంబర్‌–15,16లో ఖాళీస్థలం కబ్జాకు గురౌతుందని, ఆ స్థలాన్ని కబ్జాలకు గురికాకుండా చూడాలని వినతిపత్రంలో కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. మహేందర్‌రెడ్డి, పూర్ణరావు, చారి తదితరులున్నారు.

ప్రభుత్వ స్థలాలను పేదలకు పంచాలి

కాప్రా: కందిగూడలోని 604 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ స్థలం కబ్జాకు గురౌతుందని, గ్రేటర్‌ హైదరాబాద్‌ కాంగ్రెస్‌ కమిటీ ఎస్సీసెల్‌ కన్వీనర్‌ జె. కమలాకర్‌ ఆరోపించారు. ఇప్పటికైనా సదరు స్థలాన్ని కాపాడి స్థానికంగా ఉన్న ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కందిగూడ ప్రాంతంలో దాదాపు 150 కుటుంబాలు చాలా ఏళ్లుగా నివాసం ఉంటున్నారన్నారు. వారికి ప్రభుత్వ స్థలంలో ఇంటిస్థలం కేటాయించాలని కోరారు. దీనిపై అధికారులకు దరఖాస్తులు చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలంపై పర్యవేక్షణ లోపించడంతో కబ్జాలకు గురౌతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు స్పందించి కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు.

చిన్నతరహా పరిశ్రమల మనుగడకు తోడ్పాటు


సమాఖ్య ప్రతినిధులను అభినందించిన ఎమ్మెల్యే బండారి

కుషాయిగూడ: చిన్నతరహా, సూక్ష్మ పరిశ్రమల మనుగడకు తోడ్పాటును అందిస్తానని ఉప్పల్‌ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన కాప్రా చిన్నతరహా సూక్ష్మ పరిశ్రమల యజమానుల సమాఖ్య ప్రతినిధులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. గురువారం సమాఖ్య కార్యాలయంలో వారిని సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాలు అందేలా చూస్తానన్నారు. మాజీ కార్పొరేటర్‌ కొత్త రామారావు, బీఆర్‌ఎస్‌ నేత నేమూరి మహేష్‌గౌడ్‌ కొండూరి మురళీపంతులు, సమాఖ్య అధ్యక్షుడు యాదయ్య, ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్‌, మోహన్‌, కోశాధికారి దామోదరచారి, హిరలాల్‌, రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ పనులు పూర్తి చేయండి


వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్‌ శాంతి

అల్వాల్‌: అల్వాల్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ శాంతిశ్రీనివాస్‌రెడ్డి గురువారం హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ జీఎం అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అల్వాల్‌ డివిజన్‌ పరిధి పెండింగ్‌లో ఉన్న మురుగు కాలువలు, తాగునీటి పైపులైన్ల గురించి కార్పొరేటర్‌ శాంతి ఆయనతో చర్చించారు. పనులను త్వరితగతిన పరిశీలించి పూర్తి చేయాలని కోరారు.

పండుగ ముగిశాక టెండర్లకు ఆహ్వానం

నిమజ్జనం తర్వాత రోడ్ల మరమ్మతులపై అనుమానాలు

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్‌ ఇంజినీరింగ్‌ అధికారుల తీరు పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఏటా వినాయక నిమజ్జనం సందర్భంగా మల్కాజిగిరి సర్కిల్‌ పరిధిలోని డివిజన్‌లలో రహదారుల మరమ్మతులు చేపడుతుంటారు. దీనికి సంబంధించి అన్ని విభాగాల అధికారులు, భాగ్యనగర్‌ ఉత్సవ సమితి సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులపై అభిప్రాయాలు తెలుసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేస్తారు. ఈసారి గౌతంనగర్‌ డివిజన్‌ పరిధిలో మరమ్మతుల కోసం రూ. 18 లక్షలు, ఈస్ట్‌ ఆనంద్‌బాగ్‌ డివిజన్‌ పరిధిలో రూ. 13.80 లక్షలు, వినాయకనగర్‌ డివిజన్‌ పరిధిలో రూ. 25 లక్షలు జనరల్‌, మరో రూ. 20 లక్షలు, ఎస్సీ సామాజికవర్గానికి కేటాయిస్తూ.. మొత్తం రూ.76.80 లక్షలకు 12న టెండర్లు పిలిచి నిమజ్జనం తర్వాత రెండ్రోజులకు గురువారం టెండర్లు ఓపెన్‌ చేశారు. ఈనెల 17న నిమజ్జన ఘట్టం ముగిసింది.

● సర్కిల్‌ పరిధిలో వర్షాకాలం కోసం ఏర్పాటు చేసిన మాన్‌సూన్‌ టీమ్‌తోనే రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు పూర్తి చేశారు. వాస్తవానికి టెండర్లు రద్దుచేసి కాలనీల్లో అభివృద్ధి కోసం తిరిగి పిలిచే అవకాశం ఉన్నప్పటికీ నిమజ్జనం ముగిసిన రెండ్రోజులకు హడావిడిగా టెండర్లు పిలవడంపై పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE : AT BHONGIR
Tr. O. P. No. 10 OF 2023

BETWEEN:
Gundla Rajaiah ...petitioner
AND
Gundla Poshetty & Others ...Respondents

NOTICE

To,
[R-4] Pandala Sailu [illegible] W/o. [illegible], aged about 52 years, Occ: House-Wife, R/o. Wadaparthi Village of Bhongir Mandal, Yadadri-Bhongir District.
[R-5] Taqpala Uma W/o. Chandram, aged about 56 years, Occ: House-Wife, R/o. Wadaparthi Village of Bhongir Mandal, Yadadri-Bhongir District.
[R-7] Gadwala Somaiah, S/o. Late Narayana, aged about 52 years, Occ: Agriculture, R/o. H.No. Vinayaka nagar, [illegible], Secunderabad.
[R-8] [illegible] S/o. Late Narsimha, aged about 50 years, Occ: Business, R/o. H.No. 1-67/A, Rampally Dayara Village, Keesara Mandal, Medchal Malkajgiri District.
[R-9] R. Thirupathaiah, S/o. Late [illegible], aged 73 years, Occ: Retd. Employee, R/o. Flat No.201, Jyothi Paradise, Brindavan Colony, Kapra Muncipal, Medchal Malkajgiri District.
[R-10] R. Swarajya Laxmi, W/o. Thirupathaiah, aged 60 years, Occ: Housewife, R/o. Flat No.201, Jyothi Paradise, Brindavan Colony, Kapra Muncipal, Medchal Malkajgiri District.
[R-11] [illegible] Reddy, S/o. Late [illegible] Reddy, aged 51 years, Occ: Agriculture, R/o. H.No.4-12, Keesara Village & Mandal, Medchal Malkajgiri District.
[R-12] R.P. Bahed, S/o. Late Punamchand Bahed, aged 80 years, Occ: Business, R/o. H. No.20 [illegible] Officer's Colony, Hyderabad - 500062.
[R-13] Vengala Jagan Mohan Rao, S/o. Venkata Subbaiah, aged 80 years, Occ: Business, R/o. Plot No. 117, Flat No.3, Navnirman Nagar, Jubilee Hills Road No.7, Hyderabad - 96.
[R-14] Vengala Shyam Prasad, S/o. Jagan Mohan Rao, aged 63 years, Occ: Retd. Employee, R/o. Plot No.117, Flat No.3, Navnirman Nagar, Jubilee Hills Road No.7, Hyderabad-96.

Please take notice that the above named Petitioner Filed the Transfer OP for [illegible] of Transfer Petition Filed to Transfer the suit in O.S. No. 108 of 2017 on the File of Hon'ble Addl. Junior Civil Judge, At Bhongir to O.S.No. 92 of 2018 on the file of the Hon'ble Prl. Junior Civil Judge at Bhongir and the above said case is posted to 26-09-2024 for your appearance. In spite of this notice if you the above named Respondents No. 4,5 and 7 to 14 fails to appear before the above said court on 25-09-2024 at 10:30 AM either in person are through an advocate in case of your absence on the said date and time before the said court the matter will be decided as set ex-parte.

(By order of the Hon'ble court)
Sd/- P. Linga Reddy, Advocate, Bhongir
Cell: [illegible]